ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 11 జూన్ 2024

సింగరేణి డిపెండెంట్ల
ఉద్యోగ అర్హత వయసు 40ఏళ్లకు పెంపు 8లో..

8లో.. ఓవర్ లోడ్‌తో మట్టి తరలింపు..
అడ్డుకున్న గ్రామస్థులు

ఓవర్ లోడ్ పట్టని అధికారులు



అప్పన్నపేట వద్ద పక్కన బూడిద లారీలను నిలపడం వల్ల రోడ్డుపై పడిన బూడిద

కుందనపల్లి యాష్ పాండ్ నుంచి ఓవర్ లోడ్‌తో వెళుతున్న బూడిద లారీ

- ఒక్కో లారీలో 50 నుంచి 60 టన్నుల బూడిద తరలింపు
- రోజుకు 300 నుంచి 350 వరకు వెళుతున్న లారీలు
- నేషనల్ హైవేల నిర్మాణాలకు తరలుతున్న బూడిద

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని కుందనపల్లిలో గల ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి నిత్యం వందలాది బూడిద లారీలు ఓవర్ లోడ్‌తో వెళుతున్నాయి. మార మధ్యలో లారీల నుంచి రాలుతున్న బూడిద రహదారిపై వెళుతున్న వాహనదారుల కళ్లల్లో పడుతుండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళ్లెదుటే నిబంధనలకు విరుద్ధంగా నిత్యం వందలాది లారీలు రోడ్డు గుండా ఓవర్ లోడ్‌తో వెళుతున్నా కూడా రవాణా శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. లారీలను ఆపకుండా కాంట్రాక్టర్లు రవాణా శాఖాధికారులకు ముడుపులు ముట జెబుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో సదరు అధికారులు ఆ వాహనాల గురించి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నా రనే విమర్శలు న్నాయి. అక్కడక్కడ పలువురు ప్రజాప్రతినిధులు వాహనాలను ఆపి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని రామ గుండం ఎన్టీపీసీలో బొగ్గు ఆధారితంగా విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. బొగ్గు కాల్చడం వల్ల వెలువడే బూడిద కోసం కుందనపల్లి వద్ద 500 ఎకరాల్లో యాష్ పాండ్‌ను నిర్మించారు. దీంట్లో పెద్ద ఎత్తున బూడిద నిల్వలు ఉన్నాయి. ఈ పాండ్ నుంచి సింగరేణికి ఉచితంగా బూడిదను తరలించుకుపోతున్నారు. భూగర్భ గనుల్లో బొగ్గును వెలికి తీసిన తర్వాత వాటిని బూడిదతో నింపుతున్నారు. జాతీయ రహదారుల నిర్మా ణంలో పెద్ద ఎత్తున బూడిదను వాడుతున్నారు. సింగరేణి, జాతీయ రహదారులకు బాటమ్ యాష్‌ను వినియోగిస్తున్నారు. 2028 నాటికి యాష్ పాండ్‌లో బూడిదను అంతా ఖాళీ చేసేందుకు గాను గ్రీన్‌ఫీల్డ్ హైవే (జాతీయ రహదారులు)ల నిర్మాణంలో బాటమ్ యాష్‌ను వాడాలని నిర్దేశించింది. ఆ మేరకు ఎక్కడైతే జాతీయ రహదారులను నిర్మిస్తున్నారో, దానికి సమీపంలోని పవర్ ప్లాంట్‌ల నుంచి ఉచితంగా బాటమ్ యాష్‌ను తీసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. దీంతో ఖమ్మం, సూర్యాపేట ప్రాంతంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేల నిర్మాణాల కోసం జిల్లాలోని కుందనపల్లిలో గల ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి గత మూడు నెలల నుంచి బూడిదను తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి దాదాపు 200 నుంచి 250 కిలోమీటర్ల దూరం వరకు పెద్దపెద్ద లారీల్లో బూడిదను తరలిస్తున్నారు. ఒక్కో లారీలో నిబంధనలకు విరుద్ధంగా 50 నుంచి 60 టన్నుల వరకు బూడిదను తరలిస్తున్నారు. రవాణా చార్జీల భారాన్ని తగ్గించుకునేందుకు లారీల వాహనాల బాడీని మరింత ఎత్తుకు పెంచి వాటి సామర్థ్యానికి మించి ఒక్కో లారీలో 20 నుంచి 30 టన్నుల బూడిదను తీసుకెళుతున్నారు.

రోడ్డుపై పడుతున్న బూడిదతో వాహనదారుల ఇక్కట్లు

కుందనపల్లి యాష్ పాండ్ నుంచి బసంత్‌నగర్, పెద్దపల్లి కరీంనగర్ బైపాస్ హుజూరాబాద్, వరంగల్ మీదుగా ఖమ్మం, సూర్యాపేట జిల్లా లకు బూడిదతో లారీలు వెళుతున్నాయి. ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బూడిద లారీలను హుజూరాబాద్ సమీపంలో నిలిపివేశారు. ఎన్టీపీసీ బూడిదను నేషనల్ హైవే కోసం బూడిదను ఉచితంగానే ఇస్తున్నప్పటికీ, కాంట్రాక్టర్లు మాత్రం ఓవర్ లోడ్‌తో తరలిస్తున్నారు. మూడు వాహనాల్లో తరలించే బూడిదను రెండు వాహనాల్లోనే తరలిస్తున్నారు. దీంతో రోడ్లపై తీవ్ర భారం పడుతున్నది. స్పీడ్ బ్రేకర్లు, బొందలు, రోడ్లు దెబ్బతిన్న చోట్ల బూడిద వాహనాల్లోంచి తెప్పలుతెప్పలుగా పడుతున్నది. దీంతో ఆ బూడిద అంత గాలికి లేచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర లారీలు, వ్యాన్లు, బస్సు డ్రైవర్ల కళ్లలో పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడ చిన్నచిన్న ప్రమాదాలు కూడా జరిగాయి. ఓవర్‌లోడ్‌తో బూడిద వాహ నాలన్నీ రాజీవ్ రహదారిని ఆనుకుని రంగంపల్లి వద్ద గల ఆర్‌టీవో ఆఫీస్ ఎదుట నుంచే వెళుతున్నా కూడా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పెద్దపల్లి జిల్లా నుంచి మొదలుకుని కరీంనగర్, హన్మకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన ఆర్‌టీవో అధికారులకు కాంట్రాక్టర్లు ముడుపులు ముట్టజెప్పి వాహనాలను ఆపకుండా ఉండేందుకు మేనేజ్ చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి రోజు యాష్ పాండ్ నుంచి 300 నుంచి 350 బూడిద లారీలు వెళుతున్నట్లు బసంత్‌నగర్ వద్ద గల టోల్‌గేట్‌లో నమోదవుతున్నాయి. అప్పన్నపేట ఫ్లైఓవర్ సమీపంలో లారీల డ్రైవర్లు పక్కన నిలపడం వల్ల రోడ్ సైడ్ బర్మ్‌లు గుంతలు పడ్డాయి. వాహనాలను నిలిపిన చోట కూడా రోడ్డుపై బూడిద పడుతున్నది. ఇప్పటికైనా రవాణా శాఖాధికారులు కళ్లు తెరిచి ఓవర్ లోడ్‌తో వెళుతున్న లారీలను కట్టడి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్ ను కలిసిన మక్కాన్‌సింగ్



మోహన్ నాయక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూన్ 10: రామగుండం నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్‌ను కోరారు. సోమవారం పంజాగుట్టలోని మోహన్ నాయక్ కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలోని అంతర్గత రోడ్లు, ముఖ్యమైన రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ త్వరలోనే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని హామి ఇచ్చారు. ఆయన కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు ఉన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే



కుటుంబ సభ్యులతో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి వారిని సోమవారం పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు, ఆయన కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. అలాగే ఎమ్మెల్యే దంపతులు స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ అష్టఆశ్వర్యాలతో, సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. అనంతరం దేవస్థాన అర్చకులు ఎమ్మెల్యే విజయరమణారావు దంపతులకు శాలువా కప్పి స్వామి వారి ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు.

ఎన్టీపీసీలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి

జ్యోతినగర్, జూన్ 10: ఎన్టీపీసీ పరిధిలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ అన్ ఆర్గనైజ్డ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ బాబా కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ జి గాడ్గేకు వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చొరవతో రామగుండంలోనే ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని అహ్మద్ బాబా తెలిపారు. అయితే కొన్ని కారణాల వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. తాజాగా ఇచ్చిన వినతి పత్రానికి ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని రామగుండం ఏరియాలో నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికే 100 పడకల ఆసుపత్రికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో జరుగుతున్న ఈఎస్ఐ ఉన్నతస్థాయి సమావేశంలో ఆసుపత్రి విషయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని గాడ్గే హామీ ఇచ్చారని సయ్యద్ అహ్మద్ బాబా తెలిపారు.

'కేశోరాం'లో మోగిన ఎన్నికల నగారా

పాలకుర్తి, జూన్ 10: బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారంలో ఎట్టకేలకు కాంట్రాక్టు కార్మిక సంఘానికి ఎన్నికల నగారా మోగింది. ఈ నెల 15న పోలింగ్, కౌంటింగ్ ఉంటుందని ఎన్నికల అధికారి బద్దం డానియల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు నామినేషన్ల పత్రాలు పోటీలో ఉన్న అభ్యర్థులకు అందిస్తామని, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. 12వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిముషాల వరకు నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయిస్తామని తెలిపారు. 15వ తేదీన ఉదయం ఐదున్నర గంటల నుంచి, మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు కార్మికుల విశ్రాంతి భవనంలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల అధికారి బద్దం డానియల్ తెలిపారు.

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే



నిట్టూరులో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

పెద్దపల్లి రూరల్, జూన్ 10: మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటా మిషన్ భగీరథ నీరు అందుతున్నాయా లేవా అనే అంశాలపై సోమవారం గ్రామ పంచాయితి అధికారులు ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని నిట్టూరు, నిమ్మనపల్లి గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో ఎంపీవో సుదర్శన్ హాజరై పరిశీలించారు. ఇంటింటా నీరు అందుతున్నాయా.. లేవా.. కనెక్షన్ ఉందో లేదో.. ఎన్ని రోజులకోకసారి నీరు సరఫరా అవుతున్నాయి...నీరు సరిపోతున్నాయా..తదితర వివరాలను మిషన్ భగీరథ యాప్‌లో ఆధార్ కార్డుతో పాటు సెల్ ఫోన్‌లో పొందుపరుస్తున్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. వారి వెంట ఏపీవో రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు రమేష్, మహేష్ సిబ్బంది ఉన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ప్రజావాణికి వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ రోజు మొత్తం 42 దరఖాస్తులు రాగా, అందులో రెవెన్యూ 12, ఇతర శాఖలకు చెందినవి 30 ఉన్నాయని తెలిపారు. గోదావరిఖని పవర్ హౌస్ కాలనీకి చెందిన చల్లా బక్కరెడ్డి గోదావరిఖనిలోని జనగామ శివారు సర్వే నెంబర్ 728/బిలో 0-07 గుంటల తమ భూమిలో ఉన్న ప్రహరీ కూలగొట్టిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, గోదావరిఖని ఏసీపీకి రాస్తూ విచారణ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. మంథని మండలం సిరిపురం గ్రామానికి చెందిన దాసరి చంద్రమోహన్ అనే రైతు మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, సీఈవోలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న, సన్నకారు రైతులకు అందించే ప్రోత్సాహకాలను పెట్టుబడిదారులకు, రాజకీయ పలుకుబడిదారులకు రుణాలు అందించి డబ్బులు పోగేసుకుంటున్నారని వీరిపై చర్యలు తీసుకుని మామూలు రైతులకు రుణాలు అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సహకార అధికారికి రాస్తూ సంపూర్ణ నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కమాన్‌పూర్‌కు చెందిన జి శశిరేఖ తన భర్త జి రామరాజు పంచాయతీ కార్యదర్శిగా పదవీ విరమణ పొందిన తరువాత మరణించారని, ఆయన సర్వీస్ కాలంలో సస్పెన్షన్ ఉన్న కాలానికి సంబంధించి ఇంక్రిమెంట్, హాఫ్ పే లీవ్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ మానవతా దృక్పథంతో నిబంధనలు ప్రకారం సానుకూలంగా స్పందించి త్వరగా సమస్య పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ హోదా

- ఆనందోత్సాహంలో భాషా పండితులు

- ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు



ఆనందం వ్యక్తం చేస్తున్న భాషా పండితులు

పెద్దపల్లి రూరల్, జూన్ 10: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాష పండితులకు పదోన్నతి కల్పిస్తూ స్కూల్ అసిస్టెంట్‌లుగా నియమించే దిశగా నిర్ణయం తీసుకుంది. పెద్దపల్లి జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్-2 హోదాల్లో పనిచేస్తున్న భాషా పండితులకు పదోన్నతులు కల్పించేలా తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారికి స్కూల్ అసిస్టెంట్ హోదా దక్కనుండ టంతో ఉపాధ్యాయులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి మండల విద్యాధికారి కార్యాలయంలో జిల్లాలోని భాషా పండితుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్‌యూపీపీటీ జిల్లా అధ్యక్షుడు సట్టు కనుకయ్య మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా పండితుల అప్‌గ్రేడేషన్ కలను సాకారం చేసుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు, దీర్ఘకాలికంగా పండితుల పదోన్నతులకై రాష్ట్ర ప్రభుత్వం, అధికారులతో పోరాడుతూ సాధించామని అన్నారు. జిల్లాలో తెలుగు 112, హిందీ 87, పీఈటీలు 36, గ్రేడ్-2 పండితులుగా స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు పొందుతున్నారని, ఇంకా మిగిలి ఉన్న పండితులకు సైతం పదోన్నతులు లభిస్తాయని అన్నారు. ఆనందోత్సవాల్లో ఉపాధ్యాయులు సమి ఉల్లా, తిరుపతి, శ్రీనివాస్, శేషగిరిరావు, సుధాకర్, వాసంతి, కోటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రచ్చపల్లిలో మొదలైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

మంథని, జూన్ 10: మండలంలోని రచ్చపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఐటీ, పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సబ్ రిజిస్టర్ మంథని ఆఫీస్‌లో క్రయవిక్రయాలకు సంబంధించి ప్లాట్స్ తొలి రిజిస్ట్రేషన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావు, మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, గ్రామ శాఖ అధ్యకుడు రాంపెల్లి నాగరాజు, మల్లేష్, రమేష్, ఆరెళ్ల కిరణ్‌గౌడ్. మహేందర్, మల్లేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బడి బాట

రామగిరి, జూన్ 10: మండలంలోని కల్వచర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడి వర్కర్స్ తల్లిదండ్రులతో గ్రామంలో ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్స్ రజిత, అనసూర్య, రమాదేవి పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డు నిర్మించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

జూలపల్లి, జూన్ 10: పెద్దపల్లి నుంచి జూలపల్లి మండల కేంద్రం వరకు డబుల్‌రోడ్డు పనులను చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఎన్నో ఏళ్లక్రితం నిర్మాణం చేసిన రోడ్డు పూర్తిగా శిథిలమై ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేసారు. అంతేకాకుండా హుస్సేన్‌మియా వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేల్పుల ఓదెలు, వేల్పుల సతీష్, కంకనాల జ్యోతిబసు, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, సంకెండ్ల నర్సయ్య, దొడ్ల రాజయ్య, అమరగాని ప్రదీప్, తీగల అశోక్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 10: ఉద్యమకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాక తొలి, మలిదశ ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు అందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటి స్థలాన్ని అందజేయాలని కోరారు. ఎఫ్ఐఆర్ ఉన్న వాళ్ళకే కాకుండా ఉద్యమంలో నష్టపోయిన ఉద్యమకారులను కూడా గుర్తించి న్యాయం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మన నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని జీవితాలను త్యాగం చేసి ఉద్యమంలో 13 ఏళ్లు తెలంగాణ రాష్ట్రం సాధన కోసమే పని చేశారన్నారు.

ఉద్యమకారులను గుర్తించడానికి కమిటీ వేసిన ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందజేయాలని సూచించారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, పెద్దపల్లి పార్లమెంటరీ కన్వీనర్ బత్తుల శంకర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బేడి చంద్రకళ, పెద్దపెల్లి జిల్లా వైస్ ప్రెసిడెంట్ జున్నుగారి సుధాకర్, పెద్దపల్లి జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ లలిత రాగూర్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు కల్వల తిరుపతి, ఉద్యమకారు లు చింతకుంట వెంకటరెడ్డి, శారద, సోనాలి లలిత, బుర్ర గీత, చంటి నరసమ్మ, రామ ఎల్లమ్మ, రాజ మల్లమ్మ, పెరిక రాజమల్లు, లక్ష్మి, శేషగిరిరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు





గోదావరిఖనిలో బాణాసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు, ఎలిగేడులో సంబరాల్లో పాల్గొన్న నాయకులు

కళ్యాణ్‌నగర్, జూన్ 10: దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ మూడవ సారి బాధ్యతలు చేపట్టడాన్ని హర్షిస్తూ సోమవారం గోదావరిఖని చౌరస్తాలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య, అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ప్రజలు బీజేపీ పక్షాన ఉన్నారని, ఇండియా కూటమి ఎన్ని కుయుక్తులు పన్నినా విఫలమైందన్నారు. పెద్దపల్లిలో బీజేపీకి 3లక్షలకు పైగా ఓట్లు వేశారని, ప్రజలు నైతికంగా బీజేపీని గెలిపించారని చెప్పారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలతోనే మోదీని మూడవ సారి ప్రజలు ఆధరించారని ఆమె అన్నారు. కార్యక్రమంలో నాయకులు సునీల్, సురేందర్, మింగాని అశోక్, సతీష్, శ్యాం, కృష్ణ, సంపత్, శంకర్, రాజు, వరుణ్, రాజ్‌కుమార్, శ్రావణ్, మేకల శివ, అరవింద్, ప్రకాష్ పాల్గొన్నారు. కాకతీయనగర్‌లో మాతంగి రేణుక ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్లి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన సంక్షేమ పథకాల వల్లనే దేశ ప్రజలు మూడవ సారి ప్రధానిని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి రాజేష్, కొమ్ము శ్రీనివాస్, సంపత్, అడ్డూరి రాజేష్, కుమ్మరి మల్లేష్, వడ్డేపల్లి సదానందం, వెంకటేశ్వర్‌రావు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు: భారతదేశ ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో బీజేపీ శ్రేణులు, అభిమానులు సోమవారం టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడంతో భారతదేశం అన్నిరంగాల్లో పురోగతి సాధించి అభివృద్ధి చెందిన దేశంగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్లారపు అంజయ్య, గర్రెపల్లి నారాయణస్వామి, గాదె రంజిత్‌రెడ్డి, రాయపాక మనోహర్, పర్శరాములుగౌడ్, అమరగండ గంగయ్య, అడ్డగుంట తిరుపతిగౌడ్, బూర్ల శ్రీకర్, జనర్దన్, తిరుపతి, రాజ్‌కుమార్, సాగర్ పాల్గొన్నారు.

మెరిట్ జాబితాపై అభ్యంతరాలను 13లోగా తెలపాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కె ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిటౌన్, జూన్ 10: పెద్దపల్లి పరిధిలోని 60 పోస్టులకు జారీ చేసిన ఉద్యోగ ప్రకటనకు సంబంధించిన మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉన్నవారు ఈ నెల 13 సాయంత్రం ఐదు గంటల లోగా సమర్పించి పరిష్కరించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య శాఖ అధికారి కార్యాలయ పరిధిలోని మొత్తం 60 పోస్టుల ఉద్యోగ ప్రకటనకు సంబంధించిన మెరిట్ జాబితాను ఈనెల 11న జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం నోటీసు బోర్డుపై, అలాగే జిల్లా వెబ్‌సైట్ నందు ప్రదర్శిస్తామని తెలిపారు. మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత డాక్యుమెంట్లతో జూన్ 13 సాయంత్రం 5 గంటల లోగా సమర్పించి పరిష్కరించుకోవాలని, తదుపరి జాబితాలో ఎలాంటి సవరణలు చేయబడవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్‌కుమార్ తెలిపారు.

19లోగా బీఎస్సీ ఆనర్స్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, జూన్ 10: ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ రెండు, నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం చెల్లించడానికి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 19వ తేదీ వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుం తో 21వ తేదీ వరకు చెల్లించవచ్చని ఆయన తెలిపారు. పరీక్షలను జూలైలో నిర్వహించనున్నారు.

● ఎస్‌యూ పరిధిలోని ఎల్‌ఎల్‌బీ 2011-12 నుంచి 2019-20 వరకు అన్ని సెమిస్టర్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 19వరకు ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 21వ తేదీ వరకు తుది గడువు అని ఆయన తెలిపారు. పరీక్షలు జూలై లేదా ఆగస్టు నెలలో నిర్వహించనున్నారు.

'పొన్నంపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం'

చిగురుమామిడి, జూన్ 10: బీసీ నేత, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని కల్లు గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి తిరుపతిగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిరాధార ఆరోపనణలు చేయడం సరికాదన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోకపోతే గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఇప్పటికైనా బీసీల పట్ల చిన్న చూపు చూడటం కౌశిక్ రెడ్డికి తగదన్నారు. సమావేశంలో జిల్లా గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి భాస్కర్‌గౌడ్, ముంజ వెంకన్న, బుర్ర శ్రీనివాస్, ఇల్లందుల రాములు, పచ్చిమట్ల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, జూన్ 10: శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామ శివారులో సోమవారం బైక్ పైనుంచి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దేవునూరి అనిల్ కేశవపట్నం వైపు నుంచి రాజాపూర్ మీదుగా ధర్మారం వస్తున్నాడు. ఈ క్రమంలో రాజాపూర్ శివారులో బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది అనిల్‌కు చికిత్స అందించి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10: మండల కేంద్రంలోని గంప నాగేంద్రంకు చెందిన ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేశామని ఎస్సై రమా కాంత్ సోమవారం తెలిపారు. నాగేంద్రం తన బైక్‌ను ఈ నెల 5న స్థానిక బస్టాండ్ ప్రాంతంలో పార్క్ చేసి కిరాణా దుకాణానికి వెళ్లాడని, తిరిగి వచ్చి చూసేసరికి వాహనం కనిపించకుండా పోయిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి


అంజనేయులు మృతదేహం

సైదాపూర్, జూన్ 10: సైదాపూర్ మండలంలోని ఘణపూర్ తండాకు చెందిన బానోతు అంజనేయులు (18) ప్రమాదవ శాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీ సులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘణపూర్ తండాకు చెందిన బానోతు మోతీలాల్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నాడు. కొడుకు అంజనేయులు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటలకు అంజనేయులు బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. అర్ధరాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో తండ్రి మోతీలాల్ వెళ్లి ఎక్కడ వెతికినా కనబడలేదు. సోమవారం ఉదయం ఘణపూర్ గ్రామ శివారులోని రావుల చంద్రారెడ్డి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా అంజ నేయులు సెల్‌ఫోన్, చెప్పులు బావి గడ్డపై కనబడ్డాయి. బావిలోని నీళ్లను కరెంటు మోటర్‌తో తీయగా అంజనేయులు మృతి చెంది కనిపించాడు. తన కొడుకు అంజనేయులు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందాడని మృతుడి తండ్రి మోతీలాల్ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపారు.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

ఆటో డ్రైవర్‌ను ద్విచక్రవాహనంతో ఢీ, స్థానికులతో గొడవ


గాయపడిన రాజు

కోల్‌సిటీ, జూన్ 10: రామగుండం పారిశ్రా మిక ప్రాంతంలో రోజురోజుకు గంజాయి మత్తులో యువకుల ఆగడా లు పెరిగిపోతున్నాయి. సోమవారం సాయంత్రం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ముగ్గురు ఆటో డ్రైవర్లు నిలుచొని మాట్లాడుతుండగా గంజాయి మత్తులో అతివేగంగా వచ్చి బండి రాజు అనే ఆటో డ్రైవర్‌ను మోటార్ సైకిల్‌తో ఢీకొట్టడంతో రాజు ఎగిరిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయపడిన రాజును అటు ఇటూ తిప్పుతూ ఆ యువకులు ఇబ్బందులకు గురిచేశారు. విఠల్‌నగర్‌కు చెందిన సాయి, మహేష్ అనే ఇద్దరు యువకులు గంజాయి సేవించి గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి అతి వేగంగా వచ్చి రాజును ఢీకొట్టారు. స్థానికులు వారిని పట్టుకోగా వారిపైనే యువకులు తిరగబడడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా మోటార్ సైకిల్‌ను వదిలి పారిపోయారు. గాయపడిన బండి రాజును గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తు న్నారు. అతని పరిస్థితి విషమంగా మారింది. ఘటన స్థలంలో పోలీసులు ఉన్నప్పటికీ ఆ యువకులను పట్టుకోవడం విఫలమయ్యారు.

పాము కాటుతో మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, జూన్ 10: మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన పడాల రజిత (38) అనే మహిళ పాముకాటుతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం కుటుంబ సభ్యులతో నిద్రించగా ఆదివారం ఉదయం 2 గంటల ప్రాంతంలో గాఢనిద్రలో ఉన్న రజిత చేయికి పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త పడాల వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాకు యత్నం



పట్టాదారు ఫిర్యాదుతో బయటపడిన వైనం

మున్సిపల్ రెవెన్యూ అధికారితో పాటు మరో ఇద్దరు రిమాండ్

పరారీలో కమిషనర్‌తో పాటు కీలక వ్యక్తి

జగిత్యాల టౌన్, జూన్ 10: నకిలీ పత్రాలు సృష్టించి భూమి కబ్జాకు యత్నించిన ఐదు గురు వ్యక్తులపై జగిత్యాల పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఈ కేసు లో మున్సిపల్ రెవెన్యూ అధికారితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కమిషనర్‌తో పాటు కీలక వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొంటూ పూర్తి వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని హస్నాబాద్ శివారులోని 1599 సర్వే నెంబరులో 12 గుంటల భూమిని పట్టణానికి చెందిన కీర్తి విజయ లక్ష్మి, వుటూరి గీతారాణి, గొల్లపెల్లి సత్యనారాయణలు కొనుగోలు చేసి పూర్తి హక్కుదారులుగా ఉన్నారు.

ఈ భూమిని ఎలాగైనా కబ్జా చేయాలనే ఉద్దేశ్యంతో జిల్లా కేంద్రంలోని సుతారిపేటకు చెందిన ఖాజా అమిరుద్దీన్ అతని స్నేహితులు ముజాకిర్ అలీ, ఇమ్రాన్ అనే ముగ్గురు కలిసి సాదాబైనామాకు సంబంధించి నకిలీ ధ్రువ పత్రాలు 13-బి, 13-సితో పాటు మ్యాపును సృష్టించారు. ముగ్గురు కలిసి జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న బడుగు ప్రసాద్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ అనీల్‌తో కలిసి నకిలీ ఇంటి నంబరు, నకిలీ ఆస్తి అసెస్మెంట్ పత్రాలను సృష్టించారు. వీటి ద్వారా ఇంటి నంబరుకు వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబరు కోసం 2012 అక్టోబరు నుంచి 2025 మార్చి 31 వరకు టాక్స్ కింద రూ. 97,500 చెల్లించి భూమిని కబ్జా చేసేం దుకు పక్కాగా స్కెచ్ వేశారు. ఐదుగురు కలిసి కావాలని నేరపూరిత ఉద్దేశ్యంతో కుట్రపూరితంగా నకిలీ కాగితాలు సృష్టించి కబ్జాకు యత్నించిన భూమిని విక్రయించి వచ్చిన సొమ్మును ఐదుగురు కలిసి సమానంగా పంచుకునేలా కుట్రలు పన్నారు. తమ భూమిని కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని తెలుసుకుని భూమికి పూర్తి హక్కు దారుగా ఉన్న కీర్తి విజయలక్ష్మితో పాటు మరో ఇద్దరు కలిసి కబ్జాదారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

ఈ భూమి తమదేనని అన్ని ధ్రువ పత్రాలు ఉన్నాయని, వీఎల్‌టీ నంబరు కూడా ఉందని కబ్జాదారులు హక్కుదారులను బెదిరించారు. దీంతో కీర్తి విజయలక్ష్మి జరిగిన విషయాన్ని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు 409, 420,461, 471, 468తో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో పోలీసులు సోమవారం మున్సిపల్ రెవెన్యూ అధికారి బడుగు ప్రసాద్‌తో పాటు ఖాజా అమిరుద్దీన్, ముజాకిర్ అలీలను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు, మున్సిపల్ కమిషనర్ అనీల్‌తో పాటు ఇమ్రాన్ పరారీలో ఉన్నట్లు టౌన్ సీఐ వేణుగోపాల్ వివరించారు.

అత్యాచారయత్నం కేసులో మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జూన్ 10: పదేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కొండ రాహుల్(25)కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత సోమవారం తీర్పు ఇచ్చారు. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం.. 2023లో సిరిసిల్లలోని వీధి లో పదేళ్ల బాలిక ఒంటరిగా వెళ్లగా రాహుల్ ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. యువకుడి బారి నుంచి తప్పించుకున్న బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే ఆ యువకుడిపై అప్పటి సీఐ అనిల్ కుమార్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పీపీ పెంట శ్రీనివాస్ వాదించారు. కోర్ట్ మానిటరింగ్ ఎస్సై రవీందర్ నాయుడు, కానిస్టేబుళ్లు మహేందర్, నరేందర్‌లు 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో రాహుల్‌కు 3 సంవత్సరాల జైలు, రూ2వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

కరీంనగర్ రూరల్, జూన్ 10: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో సోమవారం కుక్కల దాడిలో మేడ శ్రీనివాస్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భావితరాలకు ఉత్తమ విద్యార్థులను అందించాలి

శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్


మాట్లాడుతున్న ఎస్‌యూ రిజిస్ట్రార్ వరప్రసాద్


కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 10: భావితరాలకు ఉత్తమమైన విద్యార్థులను అందించే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో సోమవారం తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు శారీరక పరీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులను పూర్తి చేసి అభ్యర్థులు ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎదగాలన్నారు. క్రమశిక్షణ గల భారతాన్ని నిర్మించడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు.

అనంతరం పీసెట్ కన్వీనర్ రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ మైదానంలో అభ్యర్థులకు అన్ని సౌకర్యా లను కల్పించామన్నారు. ఈ సంవత్సరం రాష్ట్రం మొత్తం నుంచి 2,400 మంది పురుషులు, మహిళలు పీసెట్‌కు హాజరుకానున్నారని తెలిపారు. రోజుకు 600 మంది అభ్యర్థులను నాలుగు రోజులపాటు శారీరక పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. మొదటిరోజు 478 మంది అభ్యర్థులు పాల్గొనగా వారికి శారీరక పరీక్షలను 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హై జంప్‌తో పాటు వివిధ రకాల క్రీడాంశాలలో నైపుణ్యాలను పరీక్షించారు. రిజిస్ట్రార్ వరప్రసాద్ అతిథులతో కలిసి జెండా ఊపి 100మీటర్ల పరుగు పందెంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పీడీ జె ప్రభాకర్‌రావు, శాతవాహన యూనవర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజిమొద్దీన్ మునవర్, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, శ్రీధర్‌రావు, నాగేశ్వర్‌రావు, పి శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


800 మీటర్ల పరుగులో పాల్గొంటున్న పీసెట్ అభ్యర్థులు

నంది రిజర్వాయర్‌లో తగ్గిన నీరు

ధర్మారం, జూన్ 10: ధర్మారం మండలం నందిమేడారంలో గల నంది రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గింది. ఈ రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గడంతో కింది భాగంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నెలలో రైతులకు సాగు నీరు అందిం చేందుకు వేమునూర్ పంప్‌హౌస్ నుంచి ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా నంది రిజర్వాయర్‌లో నీటి విడుదల చేశారు. దీంతో ఈ ప్రాంతంలోని వ్యవసాయ, గృహాల్లో ఉన్న బావుల్లో నీరు సమృద్ధిగా ఉండేది. అయితే ఇటీవల ఎండల తీవ్రత కారణంగా నంది రిజర్వాయర్‌లో నీరంతా అడుగంటి పోయింది. మొదటి రిజర్వాయర్‌లో కొంత నీరు ఉన్నప్పటికి చివరి వరకు నీరంతా అడుగంటి ఎడారిగా కనిపి స్తోంది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే తప్ప ఇక్కడ నీటి ఇబ్బందులు తొలగిపోయే అవకాశాలు లేవు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేద్దామన్నా అందులో కూడా నీరు లేదని అధికారులు చెబుతున్నారు. ఇక ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తేనే నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు.


నంది రిజర్వాయర్‌లో తగ్గిన నీటి మట్టం

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

ఎలిగేడు, జూన్ 10: ఎలిగేడు గ్రామానికి చెందిన కుడుదుల లచ్చయ్య(55)అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలిగేడులో బర్లు కాసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడ్డాడు. ఆదివారం ఉదయాన్నే బర్లను తోలుకొని గ్రామ శివారులోని ఎర్రగుంట చెరువు పరిసరాల్లో కట్టేశాడు. తిరిగి సాయంత్రం సమయంలో బర్లను తోలుకొని రావడానికి చెరువు వైపు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువుకట్టపై నుంచి జారీ చెరువులో పడి మృతి చెందాడు. మృతుడు లచ్చయ్య భార్య కుడుదుల భాగ్యలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట కేసులో 13 ఏళ్లకు..

ఏయిర్‌పోర్టులో ఒకరి అరెస్టు

మల్యాల, జూన్ 10: పేకాట కేసులో పోలీసులు ఒకరిని 13 సంవత్సరాలకు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2011లో పేకాట ఆడుతూ ఏడుగురు పోలీసులకు పట్టుబడ్డారు. అయితే ఈ కేసులో మల్యాలకు చెందిన హుస్సేన్ అనే వ్యక్తి విదేశాలకు వెళ్లాడు. కోర్టుకు హాజరు కాకపోవడంతో పోలీసులు విదేశాలకు వెళ్లాడని కోర్టుకు తెలిపారు. దీంతో లుక్ అవుట్ సర్క్యూలర్ జారీ చేశారు. శనివారం విదేశాల నుంచి ఇంటికి తిరిగివస్తుండగా హైదరాబాద్ ఏయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ పోలీసులు పట్టుకొని మల్యాల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సదరు వ్యక్తిని తీసుకువచ్చి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

రాయపట్నంలో ఇసుక డంపులు సీజ్

ధర్మపురి, జూన్ 10: ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో మైనింగ్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. రవిందర్‌రావు, పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ ఎండీ సలీమొద్దీన్, ఆర్‌ఐ రాజేంద్ర ప్రసాద్ సోమవారం సంయుక్తంగా దాడులు చేసి ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. కొంత కాలం నుంచి కొందరు వ్యక్తులు గోదావరి నదిలో అక్రమంగా ఇసుకను తొలగించి దూర ప్రాంతాల్లో విక్రయించేందుకు పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉంచారు. అందిన పక్కా సమాచారం మేరకు దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన రూ 6 లక్షలు విలువ గల ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. దీంతో ధర్మపురి చుట్టు పక్క గ్రామాల్లో కూడ అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపుల యజమానులు భయాందోళనలు చెందుతున్నారు.


రాయపట్నంలో అధికారులు దాడులు చేసి సీజ్ చేసిన ఇసుక డంప్‌లు

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

- రూ.3లక్షలు తీసుకొని నకిలీ నియమాకపత్రం అందజేత
- ప్రజావాణిలో కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు


భర్తతో కలిసి ప్రజావాణికి వచ్చిన కవిత

సుభాష్‌నగర్, జూన్ 10: జిల్లా ఆసుపత్రిలో జీఎన్‌ఎమ్ నర్స్‌గా (జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ) ఉద్యోగం ఇప్పిస్తామని రూ.3లక్షల రూపాయలు దండుకొని దొంగ నియామక పత్రాలు అందజేశారని బాధితురాలి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నుంచి బతుకుదెరువు కోసం 13సంవత్సరాల క్రితం మౌల్కర్ కవిత-దిలీప్ దంపతులు నగరానికి వచ్చారు. దిలీప్ స్థానికంగా పాన్ టేలా నిర్వహి స్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దిలీప్‌కు ఓ స్నేహితుని ద్వారా శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన మాచర్ల రాజయ్య అనే వ్యక్తి పరిచయం అయ్యాడు.

ఈ క్రమంలో జిల్లా ఆసుపత్రిలో జీఎన్‌ఎమ్ నర్స్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మ బలికాడు. ఉద్యోగం కోసం 5లక్షల రూపాయలు ఇవ్వాలని చెప్పి ముందుగా 3లక్షలు తీసుకున్నాడు. చాలా రోజులుగా ఉద్యోగం గురించి బాధితులు అడుగుతుండడంతో కలెక్టరేట్ ఏవో, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ నుంచి నకిలీ నియామక పత్రాలు ఇచ్చాడు. అనంతరం వారు ఉద్యోగంలో చేరేందుకు వెళ్లగా ఆ పత్రాలు నకిలీవి అని తేలింది. దీంతో వారు రాజయ్యను నిలదీశారు. అతడు తాను తీసుకున్న డబ్బుకు బాండు పేపర్ రాసిచ్చాడు. ఆ తర్వాత చాలా సార్లు రాజయ్యను డబ్బు ఇవ్వాలని ఒత్తిడి తీసుకువచ్చినా రేపు, మాపు అంటూ వాయిదాలు వేసుకుంటూ వచ్చాడు.

ఇటీవల అయనను డబ్బుల విషయంలో నిలదీయడంతో అసభ్య పదజాలంతో కులం పేరుతో దూషించడమే కాకుండా తమపై దాడికి ప్రయత్నించాడని బాధిత దంపతులు ఆరోపించారు. రాజయ్యపై చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు

రూ. లక్షలు వెచ్చించినా ఫలితం శూన్యం

చిగురుమామిడి, జూన్ 10: చిగురుమామిడి మండలంలో 17 గ్రామాలు ఉండగా 16 గ్రామాల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. ఉపాధి హామీ పథకం ద్వారా 1.లక్షల 90 వేల రూపాయల చొప్పున ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. మండలంలోని పీచుపల్లిలో స్థలం సమస్యతో క్రీడా ప్రాంగణం నిర్మించలేదు. 16 గ్రామాల్లో దాదాపు 30 లక్షల 40 వేల రూపా యలు ఖర్చు చేసి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో బిల్లులు సక్రమంగా రాకపోవడంతో అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారు. మరికొన్ని గ్రామాల్లో నామమాత్రంగా పనులు చేశారు. క్రీడా ప్రాంగణా లను ఉపయోగంలోకి తీసుకరావడానికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అయా గ్రామాల్లో నిర్మాణం చేసిన క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఉంది. క్రీడాప్రాంగణాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేసి పాఠశాలల విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అయా గ్రామాల ప్రత్యేక అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రత్యేక కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు ఉపయోగపడేలా చేస్తాం

మిట్టపల్లి మల్లేశం, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు

చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాల్లో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల నిర్మాణం చేపట్టింది. పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేక అవి నిరుప యోగంగా ఉన్నాయి. ఇదే విషయంపై ఈ నెల 13న జరుగనున్న మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడి క్రీడా ప్రాంగణాలు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తాం.



ఉల్లంపల్లి క్రీడాప్రాంగణం

'చట్టాలను గౌరవించాలి'



ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న యువకులు

సుల్తానాబాద్, జూన్ 10: బక్రీద్ సందర్భంగా ఆవులను వధించకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ శ్రావణ్ కుమార్‌కు ముస్లిం యువకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం యువకులు మాట్లాడుతూ ఖుర్బానీ ఇచ్చే జంతువుల్లో ఆవులను వధించకూడదని, చట్టాలను గౌరవించాలని ముస్లిం మత పెద్దలు కూడా ఆదేశించారని అన్నారు. ఎవరైనా ఆవులను వధిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని సుల్తానాబాద్ ముస్లిం యువ నాయకులు సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు మహ్మద్ రఫీక్, మహ్మద్ అక్బర్, మహ్మద్ సాదిక్, మహ్మద్ మొయిజ్ ఉన్నారు.

14న ఉచిత వైద్య శిబిరం

ఎలిగేడు, జూన్ 10: మండల కేంద్రంలో ఈనెల 14న ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా పద్మశాలి సంఘం అడాక్ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామపంచాయతీ వద్ద మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్ సౌజన్యంతో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను చేస్తారన్నారు. మహిళా డాక్టర్లచే మహిళలకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ధర్మారం, జూన్10: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవా లని నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మిత సూచించారు. సోమవారం ధర్మారం మండల పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాతావరణంలో మారుతున్న మార్పుల కారణంగా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు. టీబీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించా లని ఆమె చెప్పారు. 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికి బీసీజీ వ్యాక్సినేషన్ వేయడానికి ఆశా కార్యకర్తలు సర్వే చేయాలని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో పీహెచ్ఎన్ విజయలలిత, సూపర్‌వైజర్ జయ, జీవరాణి. మలేరియా నోడల్ పర్సన్ దామోదర్, అంగన్‌వాడీ సూపర్‌వైజన్ బ్లాండీనా. అంగన్‌వాడి కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు..

'నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్య తీసుకోవాలి'

పెద్దపల్లి టౌన్, జూన్ 10: అక్రమంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ డీఈఓను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఈఓకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలను అమ్ముతూ, విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తూ, వివిధ రకాల పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. 1994లో ప్రభుత్వం తీసుక వచ్చిన జీవో నంబర్ 1 ప్రకారం ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యాసంస్థలు పనిచేయాలని చెప్తున్నా వాటిని కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పాటించడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ధనార్జనే ధ్యేయంగా డొనేషన్లు, స్పెషల్ ఫీజులు, బస్సు ఫీజు, యూనిఫామ్ ఫీజు అని వివిధ రకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దుచేసి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, కరీంనగర్ విభాగ్ హాస్టల్ కన్వీనర్ రాసురి ప్రవీణ్, పెద్దపల్లి నగర కార్యదర్శి యతిరాజు అజయ్, నాయకులు రిషి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన రోడ్డు సర్వే చేయాలి

ముత్తారం, జూన్ 10: మండలంలోని గ్రామపంచాయతీ పరిధిలో అల్లగుట్టకు వెళ్లే దారిలో పలువురు రైతులు రోడ్డు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మంథని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అల్ల గుట్టకు పశువులు మేతకు వెళ్లేందుకు ఇబ్బందులు గురవుతున్నాయన్నారు. ఆక్రమించుకున్న పంట పొలాల మీదుగా పశువులు వెళితే రైతులు గొడవ చేస్తున్నారని సర్వే చేసి ఆ రోడ్డుకు హద్దులు ఏర్పాటు చేయాలని పలువురు గ్రామస్థులు కోరారు.

'బీటీ రోడ్డు నిర్మాణంలో అవినీతి'

ఓదెల, జూన్ 10: ఓదెల మండలం కనగర్తిలో జీఎస్ఆర్ సంస్థ నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణంలో రూ.రెండు కోట్ల అవినీతి జరిగిందని మానేరు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి చిటికేసి సతీష్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆధునిక పరిజ్ఞానం లేకుండానే రోడ్డు నిర్మించారని, విద్యుత్ స్తంభాలను తొలగించకుండా అలాగే ఉంచారన్నారు. అంతకు ముందు టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో నిర్మించిన రోడ్డుపై జీఎస్ఆర్ సంస్థ వారు ఒక లేయర్ మాత్రమే కాంక్రీట్ వేసి కోట్లాది రూపాయల ప్రజా ధనం దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఎలాంటి విచారణ నిర్వహించకుండానే, తప్పుడు నివేదికలు సృష్టించారని ఆరోపించారు.కాంట్రాక్టర్ తప్పిదాలను వెలుగులోకి రానివ్వ కుండా పాత తేదీల ఉత్తర్వులను సృష్టించి నామమాత్రంగా కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేశారని తెలిపారు.

అధికారులు ఎలాంటి విచారణ జరపకుండా సీఎం కార్యాలయాన్ని, ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించారని తెలిపారు. మురికి కాలువలు లేకుండానే రోడ్డు నిర్మించారని దీంతో ఇళ్లల్లోకి వరద నీరు ప్రవేశిస్తుందని తెలిపారు. కాంట్రాక్టర్ నుంచి అతి తక్కువలో ప్రజా సొమ్మును రికవరీ చేయడం వెనక ఇంజనీర్లు, ఆర్ అండ్‌బీ అధికారుల హస్తం ఉందని ఆరోపించారు. గ్రామంలో నిర్మించిన రోడ్డు నాణ్యతను, పూర్తిస్థాయి రికార్డులను పరిశీలించి కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో సతీష్ కోరారు.

'కార్మికులను తప్పు దారి పట్టిస్తున్న నాయకులు'



మాట్లాడుతున్న కాంట్రాక్టు కార్మికసంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య

పాలకుర్తి, జూన్ 10: కేశోరాం సిమెంటు కంపెనీలో కొందరు నాయకులు తమ స్వంత ప్రయోజనాల కోసం కార్మికులను తప్పు తోవ పట్టిస్తున్నారని కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య ఆరోపించారు. సోమవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికుల దగ్గర మెప్పు పొందేందుకు వారిని అయోమయానికి గురి చేస్తూ ఇప్పుడున్న యూనియన్‌పై బురద చల్లుతున్నారని ఆరోపించారు. బేసిక్స్ సీనియారిటి ప్రకారం ఇవ్వలేదని కొందరు కార్మికులను తప్పు తోవ పట్టిస్తూ వారిని పావు లుగా వాడుకుంటూ కార్మికులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఇక్కడి కార్మికులు వారి మాయ మాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తన హయాంలో 16 మంది కాంట్రాక్టు కార్మికులకు గ్రేడ్ ప్రమోషన్ బేసిక్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. 39 మంది లోడింగ్ కార్మికులకు వేజ్ బోర్డు ఆర్డర్స్ ఇప్పించానన్నారు. మా యూనియన్ సభ్యులు నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తలారి శంకర్, తువ్వ సతీష్, సూర సంతోష్, చిలకాని రాజేశం, శంకర్‌నాయక్, షేక్‌లాల్, వేల్పుల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌తో మట్టి తరలింపు.. అడ్డుకున్న గ్రామస్థులు

- నాలుగు టిప్పర్లకు జరిమానా

పెద్దపల్లి రూరల్, జూన్ 10: పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ ఇటుక బట్టీలకు మంథని మండలం బిట్టుపల్లి చెరువు నుంచి టిప్పర్ల ద్వారా మట్టిని ఓవర్ లోడ్‌తో తరలిస్తున్నారని ఆరోపిస్తూ, అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారని సోమవారం రాఘవపూర్ గ్రామ శివారులో మట్టి టిప్పర్‌లను గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, ఓవర్ లోడ్‌తో టిప్పర్‌లు వస్తుండటంతో రోడ్డుపై మట్టి పెల్లలు పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. రెండు గంటల పాటు టిప్పర్లను నిలిపివేసి హంగామా చేయడంతో మొదటగా ఘటన స్థలానికి రవాణ శాఖ అధికారులు చేరుకోవడంతోనే కొన్ని టిప్పర్‌లు అక్కడి నుండి బట్టీలకు చేరుకున్నాయి. దీంతో ఐదు టిప్పర్లు మిగిలిపోగా రవాణ శాఖ అధికారులు చేరుకొని సీజ్ చేస్తున్న క్రమంలో రెవెన్యూ అధికారులు చేరుకోవడంతో రవాణశాఖ అధికారులు రెవెన్యూ అధికారులకు అప్పగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెవెన్యూ అధికారులు చేరుకోవడంతో మైనింగ్ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్ చేరుకొని మట్టి టిప్పర్‌ల అనుమతులను పరిశీలించారు. అనుమతులు లేనివాటిపై చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

● అక్రమంగా మట్టి తరలింపు: ఎక్స్‌కవేటర్ సీజ్

పెద్దపల్లి రూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని నిట్టూరు గ్రామ చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారంతో సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నవీన్‌రావు చేరుకొని ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించా రు. ఈ విషయమై తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



మట్టి లారీలను అడ్డుకున్న రాఘవపూర్ గ్రామస్థులు

● మట్టి లారీలతో దెబ్బ తింటున్న రోడ్లు..

కాల్వశ్రీరాంపూర్: మండలంలో మట్టి లారీలతో రోడ్లన్నీ దెబ్బతింటున్నా యి. జమ్మికుంట మండలం నుంచి గుంపుల మండలంలోని మల్యాల, ఇప్పలపల్లి, కాల్వ శ్రీరాంపూర్, గంగారం, మంగపేట నుండి మట్టి లారీలు అధిక లోడుతో వెళ్లడం వల్ల రోడ్లన్నీ దెబ్బతింటున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఇసుక లారీలతో రహదారులన్నీ గుంతల మయంగా మారాయి. ఇసుక లారీలు బందు కావడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు ప్రస్తుతం అధిక మట్టి లోడుతో లారీలు రోడ్డుపైన పోతుండడంతో రహదారులు చెడిపోవడమే కాకుండా దుమ్ము దూళి లేచి దుకాణంలోకి వస్తున్నాయని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత రవాణా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.



అధిక లోడుతో ప్రయాణిస్తున్న మట్టి లారీ

మోదీ నిరంకుశ పాలనకు అడ్డుకట్ట వేసిన ప్రజలు

- సీపీఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యుడు జె చలపతిరావు

జ్యోతినగర్, జూన్ 10: నరేంద్ర మోదీ నిరంకుశ పాలనకు ప్రజలే అడ్డుకట్ట వేశారని, మొన్నటి ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు జె చలపతిరావు స్పష్టం చేశారు. సోమవారం ఎన్టీపీసీలో ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో చలపతిరావు మాట్లాడారు. ఇస్‌బార్ చార్ సవ్ పార్ అని విర్రవీగిన బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఎన్‌డీఏకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ఇండియా కూటమిని ప్రత్యామ్నాయంగా ప్రజలు విశ్వసించలేదని తెలిపారు. ఎన్‌డీఏ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత మోదీ ఏకపక్ష నిర్ణయాలతో ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారని, పూర్తిస్థాయి నిరంకుశ పాలన కొనసాగించారన్నారు. ఎన్‌డీఏ, ఇండియా కూటమిల ఎజెండా ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా లేకపోవడంతోనే ప్రజలు ఏ కూటమికి సరైన మద్దతునివ్వలేదన్నారు. మోదీ పాలనంతా ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేకంగా కొనసాగిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని మోదీ నెరవేర్చలేదని విమర్శించారు. ఈఎన్నికల్లో అనుకున్న మెజారిటీ రాకపోవడంతో రానున్న కాలంలో ఎన్‌డీఏ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోలేదన్నారు. రానున్న ఐదు సంవత్సరాలు సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో ప్రజలు, కార్మికుల, రైతుల భాగస్వామ్యంతో ఉద్యమాలు చేస్తామని, ప్రజలను చైతన్యవతుల్ని చేసి ప్రజా ఆకాంక్షలను నెరవేర్చేలా సర్కారుపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఇ.నరేశ్, పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి, చిలుక శంకర్, రాయమల్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జె చలపతిరావు

ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

సుల్తానాబాద్, జూన్ 10: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పై పెద్దపల్లి ఎమ్మెల్యే ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజన్న పటేల్ తెలిపారు. సుల్తానాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రధానమంత్రి మోదీ దేశానికి గొప్ప పేరును తీసుకొస్తున్నారని, మోదీని ఎమ్మెల్యే విజయరమణారావు విమర్శించడం, ఆయన పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎమ్మెల్యేకు తగదన్నారు. సమావేశంలో మండల మాజీ అధ్యక్షుడు రఘుపతిరావు, ప్రధాన కార్యదర్శులు నల్లవెల్లి శంకర్, నర్సింగోజు రమేష్ చారి, మండల మహిళామోర్చా అధ్యక్షురాలు మల్యా భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కేశోరాం'లో కార్మికుల ఆందోళన

పాలకుర్తి, జూన్ 10: కేశోరాం సిమెంటు కంపెనీలో పని చేస్తున్న 16 మంది కార్మికులు తమ పదోన్నతుల్లో అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ సోమవారం కంపెనిలోని చిమ్నీ పైకి ఎక్కి నిరసనకు దిగారు. సీనియారిటి ప్రకారం తమకు దక్కాల్సి పదోన్నతులు పైరవీకారుల అనుచరులకు అంటగట్టారని తెలిపారు. సమాచారం అందుకున్న పర్మినెంటు యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్ హరి సంఘటన స్థలానికి చేరుకొని సెల్‌ఫోన్ ద్వారా పైకెక్కిన కార్మికులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో పాటు, కంపెనీ అధికారులతో చర్చించి 16 మంది కార్మికులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం అతి త్వరలోనే సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు చిమ్నీదిగి వచ్చారు.

అవుట్‌సోర్సింగ్ కార్మికులకు న్యాయం చేస్తాం

కోల్‌సిటీ, జూన్ 10: నగరపాలక సంస్థల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అన్ని నగరపాలక సంస్థల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగుల వేతనం కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ ద్వారా విడుదలైన జీవో నంబర్ 970 ద్వారా కార్మికులకు అన్యాయం జరుగుతుందని వివరిస్తూ సోమవారం అవుట్‌సోర్సింగ్ కార్మిక సంఘం నాయకులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు వినతి పత్రం అందించారు. ఈ జీవో నిలుపుదల విషయమై ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే జీవో విషయమై ప్రభుత్వంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

ఆకట్టుకున్న చిరుతల రామాయణం

సుల్తానాబాద్, జూన్ 10: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో చిరుతల రామాయణం, పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం ఎంతగానో ప్రజలను ఆకట్టుకుంది. భూపతిపూర్‌లో ప్రతి ఏటా చిరుతల రామాయణాన్ని ప్రదర్శించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా గ్రామానికి చెందిన కళాకారులు అది, సోమవారాల్లో రామాయణం పట్టాభిషేక కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ఇందులో పాల్గొన్న చిరుతల రామాయణం పాత్రధారులను అభినందిస్తూ సన్మానం చేశారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

మంథని, జూన్ 10: కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో మంథని జపాన్ కరాటే అసోసియేషన్‌షోటోకాన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు ఆధ్వర్యంలో 17 మంది విద్యార్థులు ఆదివారం పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరచి వివిధ రకాల మెడల్స్ సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ని గెలుపొందారు. బ్లాక్ బెల్ట్ కటా విభాగం లో బొడ్డేళ్ల ఇంద్రాణి గోల్డ్ మెడల్, బేర ఆదిత్య తేజ సిల్వర్ మెడల్, వడ్లకొండ శ్రీవిన్య బ్రాంజ్ మెడల్ సాధించారు. అల్ కలర్ బెల్ట్ కటా, కుమితే విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించి కుంట సాయి ప్రణవి, హాసిని కుమితే గోల్డ్ కటా సిల్వర్, శ్రావ్య, శాంతి ప్రియా, సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులు రాగుల సహస్ర (కుమితే) సిల్వర్ (కటా) బ్రాంజ్ , అన్షు (కుమితే) (కటా) సిల్వర్ , ఆరావ్ (కటా), రాఘవ (కటా), బ్రాంజ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు ఐశ్వర్య (కుమితే) (కటా) బ్రాంజ్, భావన (కుమితే) (కటా) బ్రాంజ్, వేదన్ష్ స్త్రీతిమన్, సాహితి, స్వరమైలు ఉన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను జేకేఏ సౌత్ జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్ , షోటోకాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, సీనియర్ కరాటే మాస్టర్లు పర్శ బక్కయ్య, శంకర్ గౌడ్‌లు అభినందించారు.

నిలువెత్తు తలనీలాలతో మల్లన్నకు మొక్కులు

- 45 ఏళ్ల నుంచి మల్లికార్జునస్వామికి పరమ భక్తుడు

ఓదెల, జూన్ 10: ఓదెల శైవ క్షేత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఒక పరమ భక్తుడు సోమవారం తన నిలువెత్తు తలనీలాలతో మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని చిన్న కిష్టాపూర్‌కు చెందిన కామల్ల కొమురయ్య అనే మల్లన్న భక్తుడు సోమవారం ఎనిమిది అడుగులున్న తలనీలాలతో దర్శనం చేసుకున్నారు. తన చిన్నతనంలో జరిగిన ఒక సంఘటనతో మల్లికార్జున స్వామికి పరమ భక్తుడుగా మారి 45 ఏళ్ల నుంచి తలనీలాలను తొలగించకుండా మొక్కులు తీర్చుకుంటున్నాడు. ప్రస్తుతం ఎనిమిది అడుగుల ఎత్తులో ఉన్న తలనీలాలతో ప్రతీ ఏటా మాదిరిగానే మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు తన కుటుంబాలతో తరలివచ్చారు. ఈ విధంగా ప్రతి ఏడు మల్లన్న ఆలయానికి రావడం, దర్శనం చేసుకోవడం ఒక కార్యంగా మలుచుకున్నాడు. ఈ దేవాలయానికి కొమరయ్యతో కుటుంబాలు రావడంతో మిగతా భక్తులంతా కొమరయ్య తల వెంట్రుకలను చూసేందుకు భక్తులంతా ఆసక్తి కనబర్చారు.




నిలువెత్తు తలనీలాలతో కొమురయ్య

'రాయల్టీ చెల్లించకుండా ఇసుక అక్రమ రవాణా'

ముత్తారం, జూన్ 10: రాయల్టీ చెల్లించకుండా ఇసుకను అక్రమంగా రవణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన పెట్టెం రవి సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఇసుక మేటలు తీసేందుకు అధికారులు వచ్చి సర్వే చేసి పర్మిషన్ ఇవ్వడంతో వందల సంఖ్యలో టిప్పర్లలో దుబ్బను ఇటుక బట్టీలకు తరలించారన్నారు. ఇతర రైతు సంబందించిన పంట పొలాల్లో దుబ్బను రాయల్టీ కట్టవలసి ఉన్నా కట్టకుండా దాదాపు ఐదు లక్షల రాయల్టీ కట్టకుండ వీరికి సహకరించిన గ్రామపంచాయతీ సెక్రెటరీపై చర్యలు తీసుకోవాలన్నారు. రాయల్టీ కట్టకుండా ఇసుకదుబ్బ పర్మిషన్ లేకుండా తీసిన వ్యక్తులపై పూర్తిస్థాయి విచారణ చేయాలని ఆయన కోరారు.

ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



ఉచిత పాఠ్యపుస్తకాలను అందుకుంటున్న హెచ్ఎం

కాల్వశ్రీరాంపూర్, జూన్ 10: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో ఎంఈవో టి సురేందర్‌కుమార్ ఆదేశంతో సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది ప్రభుత్వ విద్యా శాఖ నుంచి వచ్చిన ఉచిత పాఠ్యపుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం అందజేశారు. తొలుత మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యకు ఉచిత పాఠ్యపుస్తకాలను అందించారు. ఇంగ్లీష్, తెలుగు భాషల్లో (బైలింగ్వల్ లాంగ్వేజ్‌లో) ముద్రించిన ఉచిత పాఠ్యపుస్తకాలు అందమైన రంగురంగుల డిజైన్లతో ఆకర్షణీయంగా ఉన్నాయని, ఇవి స్వయం అభ్యసనకు అనుగుణంగా పిల్లలు చదువుకోవడానికి సులభతరంగా ఉన్నాయని ఈర్ల సమ్మయ్య తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉచిత పాఠ్యపుస్తకాలను పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ జాలిగం రమేష్, కంప్యూటర్ ఆపరేటర్ సుంకరి రమేష్, సీఆర్‌పీలు కురుమశెట్టి చందర్, ఉయ్యాల వీరయ్య, కుంట కుమారస్వామి, చంద్రకళ, ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్లసమ్మయ్య పాల్గొన్నారు.

● స్కూల్ యూనిఫామ్స్ అందజేత

కమాన్‌పూర్: మరో రెండు రోజుల్లో పాఠశాలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎంఈవోకు స్కూల్ యూనిఫామ్‌లను మహిళా సంఘాల ప్రతినిధులు సోమవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ కుట్టు బాధ్యతలు ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పజెప్పగా సోమవారం ఆదివరహా టైలరింగ్ ద్వారా 1,310 స్కూల్ యూనిఫామ్‌లను ఎంఈవోకు అందించారు.

మడేలేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

రామగిరి, జూన్ 10: మండలంలోని బేగంపేట్ గ్రామంలో మడేలేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ఆరెల్లిదేవక్క ముఖ్యఅతిథిగా హాజరై ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్‌ను రజక సంఘం ఆధ్వర్యంలో నాయకులు శాలువతో సత్కారించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో రజక సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

జూలపల్లి, జూన్ 10: మండలకేంద్రంలో బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంకెండ్ల లక్ష్మినర్సయ్య ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి కొవ్వత్తులతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజేశం, ఎల్లయ్య, శ్రీకాంత్, స్వామి, శ్రీనివాస్, అశోక్, కొమురయ్య, శ్రీదర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి రూరల్, జూన్ 10: మండలంలోని కాసులపల్లి ట్రినిటి ఉన్నత పాఠశాలలో 2006-2007లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం ఒకే వేదికపై కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పాఠశాలలో చదివిన ప్రతిఒక్కరూ ప్రయోజకులు అయ్యారని మీ లాగే మీ పిల్లల భవిష్యత్ చక్కగా ఉండేందుకు మంచి విద్యను అందించి ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం విద్యార్థులు చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడప బాపురెడ్డి, ఉపాధ్యాయులు భూదేవి, రామస్వామి, నర్సయ్య, సిబానా, నిర్మల, రాజలింగం, సతీష్, సదానందం, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



డిపెండెంట్ల ఉద్యోగ అర్హత వయసు 40ఏళ్లకు పెంపు

- సర్క్యూలర్ జారీ చేసిన డైరెక్టర్(పా)

గోదావరిఖని, జూన్ 10: సింగరేణిలో డిపెండెంట్ల ఉద్యోగ అర్హత వయసును 40ఏళ్లకు పెంచుతూ యాజమాన్యం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు సోమవారం డైరెక్టర్(పా) సీఆర్‌పీ/పీఈఆర్/ఐఆర్/సీ/081/904 ద్వారా సర్క్యూలర్ జారీ చేశారు. సింగరేణిలో మెడికల్ బోర్డు ద్వారా మెడికల్ ఇన్వాలిడేట్, మరణించిన కార్మికుల డిపెండెంట్లకు 35ఏళ్లుగా ఉద్యోగ అర్హత వయసు ఉంది. దీనిని 40ఏళ్లకు పెంచాలని చాలా రోజులోగా కార్మికులు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో యాజమాన్యం డిపెండెంట్ల ఉద్యోగ అర్హత వయసును 40ఏళ్లకు పెంచుతూ సర్క్యూలర్ జారీ చేసింది. దీంతో మెడికల్ అన్‌ఫిట్ పొందే చాలా మంది కార్మికుల వారసులకు ఈ సర్క్యూలర్ ద్వారా ప్రయోజనంక కలుగనున్నది.

పదోన్నతి పొందిన అధికారికి సన్మానం

గోదావరిఖని, జూన్ 10: ఆర్‌జీ-1 ఏరియాలో ఏరియా ఇంజనీరుగా విధులు నిర్వహించిన ఎస్‌వీ రామమూర్తి జీఎం(ఈఅండ్‌ఎం) టెక్నికల్ సర్వీసెస్, కార్పొరేట్ కొత్తగూడెం నందు పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న సందర్భంగా అతనిని ఆర్‌జీ-1 ఇన్‌చార్జి జీఎం బానోతు సైదులు, అధికారులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆర్‌జీ-1 ఏరియాలో వారు చేసిన సేవలను కొనియాడారు, వారు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం వారికి అన్ని డిపార్ట్‌మెంట్ అధికారులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాంమోహన్, ఏజీఎం (పర్సనల్) లక్ష్మీనారాయణ, ఏజీఎం (సివిల్) నాగేశ్వర్‌రావు, ఏజీఎం ఆంజనేయులు, పిఓ చంద్రశేఖర్, ఏజెంట్ చిలక శ్రీనివాస్, ఏరియా సేఫ్టీ అధికారి భైద్య, ఏజీఎం (ఎక్స్‌ప్లోరేషన్) శివ నారాయణ, ఎస్ఈ(సివిల్) కేడీఆర్ ప్రసాద్, జితేందర్ సింగ్, ఎన్‌వీ రావు, అభిలాష్, శ్రీనివాస్, వీరారెడ్డి, రవీంధర్ పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

య్లైటింక్లయిన్‌కాలనీ, జూన్ 10: ప్రపంచ నేత్రదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆర్జీ-2 ఎంవీటీసీలో నేత్రదానంపె అవగాహన కార్యక్రమం జరిగింది. సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి శిక్షణ పొందతున్న ఉద్యోగులకు నేత్రదాన ఆవశ్యకతను వివరించారు. మరణానంతరం మట్టిలో వృధాగా కలిసిపోయే నేత్రాలను దానం చేస్తే ఇద్దరికి చూపును ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. నేత్రదానంపై అపోహలు వీడి అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని లింగమూర్తి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల కష్టార్జితంతోనే లాభాలు

రామగిరి, జూన్ 10: సింగరేణి కంపెనీ లాభాలు రావడానికి కాంట్రాక్టు కార్మికుల కష్టార్జితం దాగి ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు మోల్మామూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీ గని వద్ద కాంట్రాక్టు కార్మికులను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు కాంట్రాక్టు కార్మికుల కష్టాలను ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంట్రాక్టు విధానాన్ని పూర్తిగా రద్దుచేస్తామన్న హామీని విస్మరించిందన్నారు. సింగరేణిలో 25 సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులకు స్థానికంగా ఖాళీ క్వార్టర్స్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తీగల శ్రీధర్, శ్రీకాంత్, రాము, సురేష్, సంతు, కోటి తదితరులు పాల్గొన్నారు.